క్లుప్తంగా

జోరుగా ఇసుక అక్రమ వ్యాపారం



దుప్పాడ ఇసుక నిల్వలు

విజయనగరం రూరల్: టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించినప్పటికీ, చాలా చోట్ల ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. టీడీపీకి చెందిన చోటామోటా నాయకులే ఇసుక దందాకు తెరతీయడం విశేషం. దుప్పాడ గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఏకంగా తన ఇంటి వద్దే ఇసుక నిల్వలు ఉంచుకుని, ఇతర జిల్లాలకు తరలిస్తున్నాడు. ఉచిత ఇసుక తమకు దక్కడం లేదు గాని.. టీడీపీ నాయకులు లక్షల రూపాయలు దండుకుంటున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా తిరుపతి

విజయనగరం రూరల్: మండల పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్న తిరుపతిరావుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన చంద్రకళ విశాఖపట్నం వెళ్లిపోయారు. ఆమె స్థానంలో తిరుతిరావు ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డీఈఈ పి. త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలుగోలు, కొత్తూరు, పల్లిపేట, జోగిరాజుపేట, గుషిణి, బర్లపేటతో పాటు గుర్ల మండలంలోని రాగోలు గ్రామానికి సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలింత కుటుంబీకులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద శుక్రవారం కొందరు ఆందోళన చేశారు. నిండు గర్భిణిని ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకురాగా వైద్యురాలి నిర్లక్ష్యంతో పుట్టిన బిడ్డ ప్రాణాపాయ స్థితికి చేరుకుందని వారు ఆందోళన చేశారు. శిశువు వైద్య ఖర్చుల కోసం కొంత మొత్తం సాయం చేస్తామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. దీనిపై గైనకాలజిస్ట్ డా.వరలక్ష్మి వివరణ కోరగా.. వెంకటరమణపేట గ్రామానికి చెందిన గర్భిణి ఈ నెల 23 ఆస్పత్రిలో ప్రసవించిందని, శిశువు గ్యాస్ట్రో స్కిసిస్ (పేగులు బయటకు ఉండటం)తో జన్మించడంతో వెంటనే విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్లు చెప్పారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం శిశువును మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారన్నారు. వారం రోజుల తరువాత బాలింత కుటుంబ సభ్యులు తప్పుడు ఆరోపణలతో ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగినట్లు చెప్పారు.

అండర్‌పాసేజ్ ఏర్పాటు చేయాలి

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామం నుంచి బంగారమ్మ, భూదేవిపేట, పాతబగ్గాం తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో వంతెన లేకుండా ఏర్పాటు చేసిన రైల్వేగేటు వల్ల గజపతినగరం, మెంటాడ మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని బీజేపీ నాయకుడు దేవర ఈశ్వరరావు అన్నారు. స్థానిక రైల్వే గేటు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ..రైల్వే గేటు పడే సమయంలో గేటుకు ఇరువైపులా గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో సుమారు 8 గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైల్వే గేట్ ప్రాంతంలో అండర్‌పాసేజ్ వంతెన ఏర్పాటు చేయాలని కోరారు.

పాలరైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్కవరపుకోట: జిల్లాలో పాలరైతుల సమస్యలను పరిష్కరించాలని పాలరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప కృష్ణమూర్తి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ డెయిరీ ఆవు పాల ధరను తగ్గించి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వాపోయారు. ఆవుపాల ధరను పెంచి రైతులకు మేలు చేయాలని కోరారు. అలాగే విశాఖ డెయిరీని సహకారం రంగంలోకి తీసుకురావాలని, డెయిరీలో జరుగుతున్న అవినీతిపై స్వతంత్ర్య దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటీయూ ఎల్.కోట శాఖ అధ్యక్షుడు తరిణి వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

పండుటాకులకు తప్పని పాట్లు..

- పింఛన్ కోసం పడిగాపులు కాసిన వృద్ధులు
- సర్వర్ మొరాయించడంతో ఎండలో నిరీక్షణ



రాకోడు సచివాలయం వద్ద వేచి చూస్తున్న వృద్ధులు

విజయనగరం రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీలో వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తెల్లవారుజామునే ఇంటి వద్దనే పింఛన్ అందుకునే లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 22 పంచాయతీలుండగా ఉదయం 11 గంటల సమయానికి 40 శాతం పంపిణీ కూడా పూర్తవ్వలేదు. అలాగే పింఛన్‌దారులను గ్రామ సచివాలయాల వద్దకు పిలిపించి, గంటల తరబడి ఎండలో కూర్చోబెట్టిన వైనం శుక్రవారం పలు గ్రామాల్లో చోటుచేసుకుంది. మండలంలో 5,941 పెన్షన్ లబ్ధిదారులుండగా.. ప్రభుత్వం వీరికి 2,46,24,500 రూపాయలు అందజేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఒకటో తేదీ ఏడు గంటల్లోపే శతశాతం పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీలో అలసత్వం నెలకొంది. మండలంలోని పెదవేమలి, రాకోడు, దుప్పాడ, ద్వారపూడి, గుంకలాం, తదితర 22 పంచాయతీల్లో మధ్యాహ్న సమయానికి కూడా పింఛన్లు అందలేదు.

మిషన్ పని చేయలేదన్నారు..



గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయానికే వలంటీర్ డబ్బులు అందించేవాడు. టీడీపీ వచ్చిన తర్వాత సమయానికి పింఛన్ అందడం లేదు. సచివాలయం వద్దకు రమ్మన్నారు. తీరా వచ్చిన తర్వాత మిషన్ పనిచేయడం లేదని గంటల తరబడి ఉంచారు.

– అలమండ అప్పన్న, పింఛన్‌దారుడు, రాకోడు

ఇంటి వద్ద ఇవ్వడం లేదు..



పింఛన్ ఇవ్వడానికి సచివాలయం నుంచి ఎవ్వరు మా ఇంటికి రాలేదు. నేనే సచివాలయం వద్దకు వచ్చాను. 11 గంటలు దాటినా పింఛన్ ఇవ్వలేదు. ఎండలో గంటల తరబడి వేచి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– చలుమూరి రామయ్యమ్మ, పింఛన్ లబ్ధిదారు, రాకోడుగ్రామం

సర్వర్ కష్టాలు..

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పింఛన్ లబ్ధిదారులకు పడిగాపులు తప్పలేదు. ప్రతి నెలా ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా శుక్రవారం చేపట్టిన పంపిణీకి సర్వర్ కష్టాలు వెంటాడాయి. ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించగా... 8 గంటల నుంచి సర్వర్ కష్టాలు ప్రారంభమయ్యాయి. మరలా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వర్ పనిచేయడంతో మళ్లీ పింఛన్లు పంపిణీ చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి నగరంలో 96.23 శాతం పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు టీపీఆర్వో సింహాచలం తెలిపారు. మొత్తం 23,033 మంది లబ్ధిదారులు ఉండగా... అందులో 22, 65 మందికి పింఛను మొత్తం అందజేశాన్నారు. మిగిలిన వారికి శనివారం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.



ఐరిస్ తీస్తున్న సచివాలయ ఉద్యోగి

అయ్యప్పస్వామి విలక్ పూజకు ఏర్పాట్లు పూర్తి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గాజులరేగ అయ్యప్పస్వామి పీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: అయ్యప్పస్వామి విలక్ పూజకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురుస్వామి జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గాజులరేగలో ఉన్న పీఠంలో విలక్ పూజకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న గాజులరేగ గుభేల్‌పేటలో ఉన్న అయ్యప్ప పీఠం వద్ద భారీ ఎత్తున విలక్ పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. లెంక శంకరరావు ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం గణపతి హోమంతో పూజా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు అయ్యప్పస్వామి ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులందరూ స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో ఉమా, బాలు, అప్పలనాయుడు, టి.రాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నడిపల్లిలో డయేరియా తగ్గుముఖం



గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తున్న సర్పంచ్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లిలో డయేరియా తగ్గుముఖం పట్టింది. మొదటిరోజు మినహా ఎటువంటి కేసులు నమోదు కాలేదు. సర్పంచ్ లంకలపల్లి గాయత్రి ఆధ్వర్యంలో ప్రజలకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. అలాగే పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు పంచాయతీ అధికారి జ్ఞానేశ్వరరావు తెలిపారు.

పంచాయతీల ద్వారా నిధులు చెల్లించాలి

- ఎంపీడీఓ భవానీకి వినతిపత్రం అందజేసిన సర్పంచ్‌లు



ఎంపీడీఓ భవానీకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు, మండల ప్రజాప్రతినిధులు, తదితరులు

డెంకాడ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఇటీవల మంజూరైన ఉపాధి పనులను గ్రామ పంచాయతీ ద్వారా చేపట్టి, నగదు చెల్లింపులు కూడా ఉపాధి బ్యాంక్ అకౌంట్ ద్వారా చెల్లించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ భవానీని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, సర్పంచ్‌లు మాట్లాడుతూ, కాంట్రాక్టర్లకు దోచిపెట్టే విధంగా పనులు చేపట్టడం తగదన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానించిన వెండర్‌ను ఎంపిక చేయకపోతే న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లపై టీడీపీ నేతల కుట్ర

- పెదవేమలిలో 22 పింఛన్లు నిలిపివేత
- టీడీపీ నేతల ఒత్తిళ్లతోనే తొలగింపు
- మొన్న చిరుద్యోగులు, నేడు పింఛన్ లబ్ధిదారులపై కక్షసాధింపు



గంట్యాడ: అధికారం వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతలు రెచ్చి పోతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, తటస్థులపై తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. నిన్న మొన్నటి వరకు చిరుద్యోగులపై తమ ప్రతాపాన్ని చూపిన నేతలు నేడు సామాజిక పింఛన్ లబ్ధిదారులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో గ్రామాల్లో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పాఠశాలల్లో పనిచేసే వాచ్ మెన్‌లు, ఆయాలు, వెలుగులో పనిచేసే గ్రామైఖ్య సంఘం సహాయకులు(వీఓఏ)లు, కేజీబీవీల్లో పనిచేసే కుక్, వాచ్‌మెన్‌లను ఆయా శాఖల అధికారులు తొలగించారు. ఇప్పుడు సామాజిక పింఛన్‌పై ఆధారపడే అభాగ్యులపై కూటమి నేతలు కక్ష కట్టారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత మండలంలో టీడీపీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. గంట్యాడ మండలంలో పెదవేమలి గ్రామానికి చెందిన 22 మంది దివ్యాంగులకు పింఛన్లు నిలిపివేశారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు పింఛన్లు నిలిపివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా పింఛన్లు ఎందుకు నిలిపివేశారని దివ్యాంగులు అడిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు సచివాలయ సిబ్బంది చెపుతున్నారని బాధితులు వాపోతున్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావును ప్రశ్నించగా.. 22 మంది దివ్యాంగ పింఛన్లు ఆపేయాలని ఎంపీడీఓ మౌఖికంగా ఆదేశించారని, అందుకే పింఛన్లు నిలిపివేశామని చెప్పారు.

ఎలా బతకాలో తెలియడం లేదు



నాపేరు గండి అప్పారావు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. నాకు 2011 దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఈరోజు నాకు పింఛన్ ఇవ్వలేదు. మా వీధిలోకి పింఛన్ పంపిణీ చేసేందుకు వచ్చిన సచివాలయం సిబ్బందిని అడిగితే నీ పింఛన్ ఆపేశామని చెప్పారు. 13 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు ఆపేశారు. ఎలా బతకాలో తెలియడం లేదు.

పింఛనే జీవనాధారం



నాపేరు సింగిడి పాపునాయుడు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. మత్యకారుడిని. నాకు 2013 నుంచి దివ్యాంగ పింఛన్ వస్తుంది. ఈరోజు మావీధిలోకి వచ్చిన సచివాలయం సిబ్బందిని నా పింఛన్ ఇవ్వమని అడిగితే నీ పింఛన్‌ను ఆపేశామని చెప్పారు. నాకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాకు సెంటు భూమి లేదు. పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాను. నా పింఛన్‌ను ఆపేస్తే నేను ఎలా బతకాలి.

• అభినందనలు..



పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం. కార్తీక్, ఎం.మహేష్ అండర్ -14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు.. పి. మహేష్ అండర్ -17 క్రికెట్ పోటీలకు.. ఎ. ఉదయ్‌కుమార్, వై.అమృత అండర్ - 14 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల రెండో తేదీ నుంచి కోనసీమ, పల్నాడు జిల్లాల్లో జరగనున్న క్రికెట్, ఖోఖో పోటీల్లో విద్యార్థులు తలపడతారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్‌ఎం బి. శంకరరావు, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

- పూసపాటిరేగ

• సందర్శన..



పూసపాటిరేగ కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆర్. విజయభాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అపార్ నమోదు ఎంతవరకు అయిందని ఆరా తీయగా... 85 శాతం వరకు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ అంబళ్ల భారతి బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

- పూసపాటిరేగ

• నియామకం..



ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ పైల రమేష్‌రాజును నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రమేష్‌రాజుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లా కన్వీనర్‌గా వ్యవహరించిన దయానంద్ తన వ్యక్తిగత కారణాల వల్ల బాధ్యతల నుంచి తప్పుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నయీమ్ ఎం.డి, తిప్పాన కోటేశ్వరరావు, తాళ్లూరు వెంకట్, రఘుమండ శ్రీను, సనపతి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

- విజయనగరం అర్బన్

• ఆలోచింపజేసిన ప్రాజెక్ట్‌లు..



జిల్లా కేంద్రంలో నెహ్రూ యువకేంద్రం, సెట్విజ్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన సైన్స్‌మేళాలో రామతీర్థం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ అంశాల్లో నిర్వహించిన సైన్స్ మేళాలో రామతీర్థం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన యాంటీ రిగ్గింగ్ ఓటింగ్ యంత్రం, యాప్ డిజైనింగ్ ప్రాజెక్టులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు విద్యార్థులు మహేష్‌బాబు, యశ్వంత్, గైడ్ బల్లా శ్రీనివాసరావును పాఠశాల హెచ్‌ఎం శాస్త్రి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

- నెల్లిమర్ల రూరల్

• రన్ ఫర్ యూనిటీ..



జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నగర శివారులో గల విజ్జి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శాప్ కోచ్‌లు, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

- విజయనగరం

అమరజీవికి నివాళి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రాన్ని సాధించేందుకు పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి అమరజీవిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు.